సాక్షి
బాపట్ల
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు దిగువకు 4,000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 41.98 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



డ్వామా పీడీ శంకర్ పర్యటన

మేడికొండూరు: మేడికొండూరు మండలంలోని వివిధ గ్రామాల్లో డ్వామా పీడీ శంకర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. తొలుత పేరేచర్లలోని నగర వనాన్ని సందర్శించారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



దాచేపల్లి: మండలంలోని భట్రుపాలెం గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం జరగనున్నది. అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పసి మోములో పరవశం

సాక్షి మీడియా, గ్రీన్‌పీస్ సంయుక్త ఆధ్వర్యంలో వైభవంగా బాలల దినోత్సవం

- చిన్నారులకు ఆటల పోటీలు
- బహుమతులు అందజేత
- ఆద్యంతం ఉత్సాహంగా వేడుకలు

బాపట్ల/బాపట్లటౌన్ : పసి మోములు పరవశంతో మెరిశాయి. బాలల దినోత్సవం రోజున ఆటపాటలతో మురిశాయి. గురువారం మండలంలోని ముత్తాయపాలెం ప్రాథమిక పాఠశాలలో సాక్షి మీడియా, గ్రీన్‌పీస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలేసి వక్తలు నివాళులర్పించారు. పాఠశాలలోని చిన్నారులకు మ్యూజికల్ చైర్, గోతాల ఆట, లెమన్ అండ్ స్పూన్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రీన్‌పీస్ సంస్థ చైర్మన్ పిన్నిబోయిన రత్నం మాట్లాడుతూ తొలి ప్రధానిగా నెహ్రూ దేశ అభివృద్ధికి పటిష్ట పునాదులు వేశారన్నారు. నెహ్రూను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలీనోద్యమానికి నెహ్రూ నాంది పలికారన్నారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ కర్రి అరుణ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం తగ్గించి చదువుపై దృష్టి సారించాలన్నారు. భారత నిర్మాతల్లో అగ్రగణ్యుడిగా ఎదిగిన ఘనత నెహ్రూకే దక్కిందన్నారు. దేశంలో మౌలిక వసతుల కల్పనకు నెహ్రూ విశేషంగా కృషి చేశారని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ 'సాక్షి' మీడియా, గ్రీన్‌పీస్ ఆధ్వర్యంలో పాఠశాలలో బాలల దినోత్సవ పోటీలు నిర్వహించి చిన్నారులకు బహుమతులు అందజేయటం హర్షణీయమన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. ఎంతో ఉన్నతమైన పదవులు అలంకరించిన జవహర్‌లాల్ నెహ్రూ చిన్నపిల్లలపై ఎంతో ప్రేమానురాగాలు కలిగి ఉండేవారన్నారు. అందు వలనే నెహ్రూ పుట్టిన రోజును మనందరం బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.


నెహ్రూ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



విజేతలు వీరే..

పరుగుపందెం పోటీల్లో మొదటి బహుమతి ఎం.ఉమా మహేష్, ద్వితీయ బహుమతి డి.వీరలోకేష్, తృతీయ బహుమతి ఎం.కుసుమ గెలుపొందారు. మ్యూజికల్ చైర్ పోటీల్లో ఎం.శివనాగశ్రీ (ప్రథమ), వి.తులసి (ద్వితీయ), కె.తేజ (తృతీయ), లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో జి.ద్రాక్షాయని (ప్రథమ), ఎన్.కుసుమ (ద్వితీయ), కె.సాయిప్రభ (తృతీయ), గోతాలాటలో వి.రిక్కీ (ప్రథమ), ఎస్.సన్నీ (ద్వితీయ), పి.వైశాలి (తృతీయ) బహుమతులు సాధించారు. అనంతరం చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌పీస్ సంస్థ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు జి.రమాదేవి, కె.ఉమామహేశ్వరి, 'సాక్షి' బాపట్ల ఆర్సీ ఇన్‌చార్జి ఎం.అంజయ్య, బాపట్ల టౌన్ రిపోర్టర్ ఎ.కోటేశ్వరరావు, సాక్షి టీవీ రిపోర్టర్ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న చిన్నారులతో సాక్షి సిబ్బంది, గ్రీన్‌పీస్ సంస్థ నిర్వాహకులు


గోతాలాటలో పాల్గొన్న చిన్నారులు


పరుగుపందెంలో చిన్నారులు


లెమన్ అండ్ స్పూన్ గేమ్ ఆడుతున్న చిన్నారులు


మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

న్యూస్‌రీల్

23న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సమావేశం

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23న గుంటూరు జెడ్పీ ఏసీ సమావేశ మందిరంలో జరుగుతుందని జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న జరగాల్సిన సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని, 23న జరుగుతుందని వివరించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగే సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరుకావాలని కోరారు.

పెదకాకాని శివాలయంలో కార్తిక పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు



పెదకాకాని: శివాలయంలో కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ కామినేని బసవ శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం పరమశివునికి అత్యంత ప్రీతికరమైన కార్తిక పౌర్ణమి పర్వదినం కావడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా త్వరితగతిన స్వామి దర్శనం కలిగేలా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు దాతల సహకారంతో తాగునీరు, మజ్జిగ, పాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శాంతి భద్రతల నిమిత్తం పోలీసు, అగ్నిమాపక, పంచాయతీ, ఆరోగ్యశాఖల సిబ్బంది సేవలు వినియోగించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వాహన పూజలు నిలుపుదల చేశామన్నారు. సాయంత్రం పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వహిస్తామని డీసీ శ్రీనివాసరావు తెలిపారు.

చేబ్రోలులో 26 మి.మీ. వర్షం

కొరిటెపాడు: గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 26 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా కాకుమాను మండలంలో 0.4 మి.మీ. వర్షం పడింది. సగటున 4.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లిపర 18.4, మంగళగిరి 9.2, పొన్నూరు 7.2, తెనాలి 6.4, వట్టిచెరుకూరు 5.2, ప్రత్తిపాడు 5, తాడికొండ మండలంలో 3.4 మి.మీ. చొప్పున వర్షం పడింది.

50,659 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 47,617 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 50,659 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 17,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 17,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 27,313 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

సీజీహెచ్‌ఎస్‌కు నేడు సెలవు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గురునానక్ జయంతి సందర్భంగా కేంద్రప్రభుత్వం శుక్రవారం సెలవు దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచితంగా సేవలందించే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) కార్యాలయం మూసి ఉంటుందని గుంటూరు సీజీహెచ్‌ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.సిహెచ్.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని సీజీహెచ్‌ఎస్ కార్డుదారులు వైద్య సేవల నిమిత్తం శుక్రవారం గుంటూరుకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

పథకాలకు పాతరేసేందుకే
బాబు డైవర్షన్ పాలి'ట్రిక్స్'

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ ధ్వజం



రేపల్లె రూరల్: డైవర్షన్ పాలి'ట్రిక్స్'లో సీఎం చంద్రబాబు దిట్ట అని, హామీలను అమలు చేయకుండా ప్రజలను దారి మళ్ళించేందుకు చంద్రబాబు రోజుకో డ్రామాకు తెరలేపుతున్నారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ విమర్శించారు. గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమలు చేయలేని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ఇప్పుడు వాటిపై నోరుమెదపడం లేదని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలంటూ ఊరూరా ఊకదంపుడు ప్రసంగాలు చేసిన నేతలు గెలిచాక విస్మరించారన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో హామీల అమలుకు నిధులు కేటాయించకపోవటం ప్రజలను మోసగించటమేనన్నారు. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లంటూ ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలోకి తొక్కారన్నారు. నిబంధనల పేరుతో సగానికిపైగా అర్హులను అనర్హుల జాబితాలో చేర్చి నిరాశకు గురిచేస్తున్నారని విమర్శించారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంశాలను పూర్తిగా మర్చిపోయారని చెప్పారు. హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించి గొంతు నొక్కుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వం తీరును గమనిస్తూనే ఉన్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రేపల్లె పట్టణంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలిరావటం ఆనందంగా ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని హామీనిచ్చారు.

బాలలంతా పాఠశాలల్లోనే ఉండాలి

కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: బాలలంతా పాఠశాలల్లోనే ఉండాలని బాలల హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా బాపట్ల పట్టణంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. తొలుత బాల సదన్ వద్ద ఏర్పాటు చేసిన నెహ్రూ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమశాఖ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ బాల సదన్ నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు సాగింది. అనంతరం పాత బస్టాండ్ వద్ద బాలలు మానవహారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడదామని చెప్పారు. చిన్నారులందరూ చదువుకోవాలని సూచించారు. బాలలను పనికి పంపవద్దని తల్లిదండ్రులకు సూచించారు. బాల కార్మికులు కనిపిస్తే నేరుగా 1098 చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, డీఈఓ పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.


బాలల దినోత్సవం సందర్భంగా ప్రదర్శనలో పాల్గొన్న కలెక్టర్ వెంకట మురళి, అధికారులు


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

'అల'రింతకు సిద్ధం

- కార్తిక పున్నమికి సూర్యలంక ముస్తాబు
- పుణ్యస్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- తీరంలోని ఆలయాల్లోనూ ప్రత్యేక వసతులు

బాపట్లటౌన్: కార్తిక పౌర్ణమి పుణ్యస్నానాలకు శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా సూర్యలంక తీరాన్ని అధికారులు ముస్తాబు చేశారు. ప్రత్యేక ఏర్పాట్లతోపాటు వసతులు కల్పించారు. జల్లు స్నానాలకు ప్రత్యేకంగా షవర్ పాయింట్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు 150 తాత్కాలిక గదులను సిద్ధం చేశారు. స్నానాలకు వచ్చే భక్తులు, యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ జి.రామాంజనేయులు సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు సముద్రంలోకి దిగకుండా జల్లు స్నానాలు చేయాలని చెప్పారు. తీరంలో ఏర్పాటు చేసిన జెండాలు దాటి సముద్రంలోకి వెళ్లరాదని పేర్కొన్నారు. మద్యం సేవించి వచ్చే వారిని, జంటలుగా తీరంలో తిరిగే వారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. విలువైన ఆభరణాలతో తీరానికి రావద్దని సూచించారు.

ప్రత్యేక బస్సులు

బాపట్ల నుంచి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యలంక సముద్రతీరానికి వెళ్ళే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. గుంటూరు బస్టాండ్ నుంచి నేరుగా ఐదు బస్సులు సూర్యలంక తీరానికి చేరుకుంటాయని, వీటితో పాటు బాపట్ల పాతబస్టాండ్ నుంచి నేరుగా తీరం వరకు పది ఆర్టీసీ బస్సులు, రైలు మార్గాన సూర్యలంకకు చేరుకునే భక్తుల సౌకర్యార్థం రైలు సమయాలకు అనుగుణంగా రైల్వేస్టేషన్ నుంచి రెండు బస్సులను నడుపుతున్నట్లు బాపట్ల ఆర్టీసీ డీఎం శ్రీమన్నారాయణ తెలిపారు.

తీరంలోని తోటలూ సిద్ధం

పుణ్యస్నానాల అనంతరం వనభోజనాలకు తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీడిమామిడి తోటలు, వన నర్సరీలోని నేరుడు చెట్ల కింద అధికారులు ఏర్పాట్లు చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏకో రిసార్ట్స్ కూడా ఇక్కడ అందుబాటులో ఉంది. తీరంలో ఉన్న తారకేశ్వరస్వామి దేవాలయంతోపాటు, ఆంజనేయస్వామి ఆలయం, నవగ్రహాలు ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యాయి.

పటిష్ట బందోబస్తు

పుణ్యస్నానాల నేపథ్యంలో తీరంలో 316 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తీరాన్ని సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. బందోబస్తు నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 16 మంది ఎస్‌ఐలు, వీరితోపాటు కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 316 మంది బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు. సూర్యలంక నుంచి బాపట్ల వరకు ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టనున్నట్టు రూరల్ సీఐ గంగాధర్ తెలిపారు. ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్ల బృందాలను సిద్ధం చేశారు. 15 వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు.

నాలుగు బీచ్‌ల వద్ద 400 మందితో బందోబస్తు

కార్తిక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని నాలుగు బీచ్‌ల వద్ద 400 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. గురువారం రాత్రి జిల్లాలోని సూర్యలంక, రామాపురం, ఓడరేవు, నిజాంపట్నం సముద్రతీర ప్రాంతాల్లో బందోబస్తుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు.


సాగర తీరంలో బందోబస్తు సిబ్బందికి సూచనలు చేస్తున్న పోలీసు ఉన్నతాధికారులు


కార్తిక పౌర్ణమి పూజల కోసం ముస్తాబైన సూర్యలంకలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయం

నేటి నుంచి వీవీఐటీలో బాలోత్సవ్


బాలోత్సవ్ వేడుకలకు ముస్తాబైన నంబూరులోని వీవీఐటీ కళాశాల

పెదకాకాని: చిన్నారుల్లో సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించడమే బాలోత్సవ్ ముఖ్య ఉద్దేశమని వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ చెప్పారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈనెల 15 శుక్రవారం నుంచి బాలోత్సవ్-2024 నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవం జరుగుతుందని వివరించారు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. బాలోత్సవ్‌లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 650 పాఠశాలల నుంచి 13 వేల మంది విద్యార్థులు ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. 20 అంశాలు, 61 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, దీనికోసం వీవీఐటీ ప్రాగణంలో 30 వేదికలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సహాయం చేసే నిమిత్తం గుంటూరు, విజయవాడ నగరాల్లోని బస్టాండ్, రైల్వే స్టేషన్లలో సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులను కళాశాల బస్సుల ద్వారా బాలోత్సవ్ ప్రాంగణానికి తరలిస్తామని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత వసతి, భోజన ఏర్పాట్లూ చేస్తున్నామని పేర్కొన్నారు. 600 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపడతారని వెల్లడించారు. 300 మంది ఎన్‌సీసీ విద్యార్థులు రక్షణ బాధ్యతలు తీసుకుంటారని వివరించారు. వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరిగితే ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్తగా పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుంటూరు ఆస్టర్ రమేష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అంబులెన్సును ఏర్పాటు చేశామన్నారు. బాలోత్సవ్‌లో పాల్గొనే వారు తమ వెంట జనరల్ మెడిసిన్స్‌తోపాటు బాలోత్సవ్ కమిటీ నిర్ణయం మేరకు ప్లాస్టిక్ రహిత వాటర్ బాటిల్‌ను తెచ్చుకోవాలని కోరారు.

క్లుప్తంగా

పోసాని కృష్ణ మురళీపై ఫిర్యాదు

బాపట్ల టౌన్ : ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణ మురళీపై బాపట్లలోని జనసేన పార్టీ నాయకులు గురువారం పట్టణ సీఐ ఆర్. అహ్మద్‌జానీకి ఫిర్యాదు చేశారు. గతంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, బాపట్ల పట్టణ నాయకుడు కారుమూరి అంజినేష్, కర్లపాలెం మండలం నాయకుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, పిట్ల వాని పాలెం మండల నాయకుడు మడసాని బాలాజీ ఉన్నారు.

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై పోసాని కృష్ణ మురళీ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లం సరోజిని, మరికొందరు నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ గురువారం రాత్రి కేసు నమోదు చేశారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టుకు కొత్తపేట విద్యార్థులు ఎంపిక



వేటపాలెం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు కొత్తపేట విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు గుమ్మా శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పాఠశాల నుంచి కే ఏశోబు, ఎస్ శ్రావణి, వీ వెంకట చరణ్, ఎన్ జయచంద్రిక, బీ జోషిరాజు, ఈ. వెంకాయమ్మ ఎంపికవడంతో వారిని అభినందించారు. విద్యార్థులను స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు గవిని నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

25 మందిపై వివాదం కేసు

తాడికొండ: వివాదం కేసులో వచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన 25 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామానికి చెందిన సరిపూడి సాంబ శివరావుకు కొండవీటి ధర్మతేజ, శివ పార్వతి, కొండవీటి రాశిలకు మధ్య గత కొంత కాలంగా ఈ వివాదం నడుస్తుంది.

బాధ్యతగా ఫిర్యాదులు పరిష్కరించాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: జిల్లాలో రెవెన్యూ శాఖ సేవలు, ఫిర్యాదులు ప్రజల సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ మినీ సమావేశ మందిరంలో జరిగిన రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి , సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తో కలిసి ఉదయం రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లు, సర్వేయర్లతో, సాయంత్రం రెవెన్యూ, పోలీస్ సమన్వయ అంశాలపై తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రధాన విధులైన భూ సంబంధిత, సర్టిఫికేట్ల జారీ సేవలలో జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. జిల్లాలో రెవెన్యూ శాఖ పనితీరు మరింత మెరుగుపర్చేందుకు ప్రతినెలా రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్ నిర్వహించి, రెవెన్యూ సేవలపై సమీక్ష నిర్వహించటం జరుగుతుందన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదులను వచ్చిన 24 గంటల్లోనే పరిశీలించి పరిష్కార దిశగా చర్యల కోసం సంబంధిత ఉద్యోగులకు ఖచ్చితంగా ఎసైన్ చేయాలన్నారు. ఏపీ సేవాలో రెవెన్యూ సేవలకు సంబంధించి భూ సంబంధిత, ఫ్యామిలీ మెంబర్లు, పుట్టిన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల ఇతర ధృవీకరణ పత్రాలు పెండింగ్ లేకుండా సత్వరమే జారీ చేయాలన్నారు. జిల్లాలో ఇళ్ళ స్థలాలకు సేకరించి భూములపై నిర్దేశించిన ఫార్మేట్‌లో వివరాలను సమర్పించాలన్నారు. జిల్లాలో 2019 నుంచి 2024 వరకు కేటాయించిన భూములపై వివరాలు అందించాలన్నారు. సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లో వచ్చిన ఫిర్యాదులు క్వాలిటీతో పాజిటివ్ గా పరిష్కరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, సర్వేయర్లు, పోలీసులు తెలిపిన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: శారీరక మార్పు కారణంగా దేశ వ్యాప్తంగా కోట్లాది మంది మధుమేహం వ్యాధి బారిన పడుతున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. మధుమేహం వాయిదా వేయడం, నిరోధించటం చేయాలంటే ప్రతి ఒక్కరూ మంచి శారీరక శ్రమ కలిగి ఉండాలన్నారు. గురువారం గుంటూరు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురంలోని అసోసియేషన్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథి డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డేగలప్రభాకర్, హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హేమకుమారి హాజరయ్యారు. ర్యాలీ ప్రారంభించిన డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గుంటూరు ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ ప్రజల ఆరోగ్యం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. మధుమేహాన్ని గుర్తించలేకపోయిన, సరైన సమయంలో మంచి వైద్యం పొందకపోయినా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్య శైలిని కలిగి ఉండటం ద్వారా డయాబెటిక్ కాంప్లికేషన్స్ నుంచి విముక్తి పొందవచ్చన్నారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. డాక్టర్ ఎస్. హేమ కుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మధుమేహం వ్యాధిపై అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యవంతమైన ప్రపంచాన్ని మనం నిర్మించుకోవచ్చని చెప్పారు. ఆనం సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రయోజన కార్యక్రమాలను మా సొంత నిధులతో సభ్యులందరం వెనుకాడకుండా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు డయాబెటిక్ స్క్రీనింగ్ టెస్ట్ ఉచితంగా నిర్వహించి వ్యాధిగ్రస్తులకు వైద్య సూచనలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తాడేకూరు శ్రీహరి, గుంటూరు నగర అధ్యక్షుడు ఎం.వెంకటలక్ష్మణ్, కార్యదర్శి బి.శ్రీనివాస్, నేషనల్ ఎక్సరే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు ఇన్‌చార్జి ఏపీపీగా 'కోట'



తెనాలిరూరల్: తెనాలిలోని పోక్సో కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కోట రమేష్‌బాబు నాయుడిని నియమిస్తూ డైరెక్టర్ ప్రాసిక్యూషన్స్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ నుంచి ఉత్తర్వులను గురువారం అందుకున్నారు. ప్రస్తుతం ఈయన 11వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి ఏపీపీగా, ఏఫ్‌జే కోర్టు ఏపీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రత్తిపాడులో పోసానిపై ఫిర్యాదు

ప్రత్తిపాడు: సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై గుంటూరు జిల్లా ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో టీడీపీ తెలుగురైతు విభాగం రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నవంబరు 12వ తేదీన సాక్షి మీడియా ప్రైవేట్ లిమిటెడ్ (సాక్షి టీవీ) లైవ్ ప్రసారంలో పోసాని కృష్ణమురళి వ్యక్తిగతంగా బీఆర్ నాయుడును, ఆయన అధ్యక్షతన పని చేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం, అదే విధంగా టీవీ-5 ఛానల్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించాయంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీఆర్డీఏ భూముల్లో పంట పండిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తాడికొండ: సీఆర్డీఏకు పూలింగ్ ఇచ్చిన భూముల్లో అక్రమంగా దున్ని పంటలు పండిస్తున్న వ్యక్తిపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్ళూరు ఎస్ఐ కొండలు తెలిపారు. శాఖమూరు గ్రామానికి చెందిన జొన్నకూటి ప్రశాంత్ సీఆర్డీయేకు చెందిన 25 ఎకరాల భూమిలో దున్ని సాగుచేస్తున్నట్లు ఏపీ సీఆర్డీఏ యూనిట్ 19 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శ్రీనివాస్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైందవ శంఖారావం సన్నాహక సమావేశం

రొంపిచర్ల: దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించేలోగా దేవాలయాల నిర్వహణలో సమస్కరణల డిమాండ్ కోసం జనవరి 5వ తేదీ విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ సహ బౌధిక్ ప్రముఖ్ కొత్తా వెంకటరామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక కన్యాకా పరమేశ్వరి ఆలయంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్‌లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఖండ కన్వీనర్ మారెళ్ల శ్రీనివాసరెడ్డి, గొడవర్తి వెంకటేశ్వర్లు, బలరామరాజు, కోటేశ్వరరావు, పలు క్షేత్రాల నాయకులు, కార్యకర్తలు, పలు హిందూ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మిల్లులో రేషన్ బియ్యం స్వాధీనం

చుండూరు(వేమూరు): రేషన్ బియ్యం తరలించేందుకు చుండూరు రైస్ మిల్లు అడ్డాగా మారింది. ఈ మిల్లులో 415 క్వింటాళ్ల రేషన్ బియ్యం లారీకి లోడు చేస్తుండగా సమాచారం రావడంతో దాడి చేయడం జరిగిందని పౌర సరఫరాల శాఖ అధికారి కిషోర్ తెలిపారు. నడిగడ్డ వారి పాలెం పరిధిలోని ఈ మిల్లు గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మిల్లుకు సీల్ వేశారు. రైస్ మిల్లు ఇద్దరు వ్యక్తులపై అగ్రిమెంట్ అయినందున వారిపై కేసు నమోదు చేశారు. లారీని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. గత శనివారం కూడా అమర్తలూరు రైస్ మిల్లు వద్ద ఎస్ఐ జానకి అమర్ వర్ధన్ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని కూచిపూడి రైస్ మిల్లు వద్ద పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు. రెండు నెలల క్రితం కొల్లూరు రేషన్ బియ్యం వ్యాపారి కార్తీక్ కూడా ఈ దందాలో చిక్కాడు. పలువురు స్థానిక నాయకులకు ఈ వ్యవహారంలో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏడుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం


ఆటో, బైక్ ఢీ కొన్న దృశ్యం

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఏడుగురు గాయాలపాలయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. తెనాలి జేఎంజే కళాశాల వద్ద టూ వీలర్‌ను తప్పించే క్రమంలో మరో టూ వీలర్‌ను ఆటో ఢీ కొట్టడంతో గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. తెనాలి నుంచి ప్రయాణీకులతో పాటు నిమ్మకాయల బస్తాలతో అంగలకుదురు వైపు వెళ్తున్న ఓ ఆటో అంగలకుదురు వైపు నుండి తెనాలి వస్తున్న మోటార్ బైక్ అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి పక్కగా వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న బి. జ్ఞానరాజు (49) తీవ్రంగా గాయపడగా అతడిని తెనాలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జ్ఞానరాజు మృతి చెందాడు. అదే విధంగా ఆటోలో ఉన్న డ్రైవర్, నలుగురు ప్రయాణీకులతో పాటు ఎదురుగా వచ్చిన బైక్‌పై ఉన్న ఇద్దరు కూడా గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించారు. మిగిలిన వారిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు జ్ఞానరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా ప్రస్తుతం వడ్లమూడిలోని అత్తింట్లో ఉంటున్నాడని బంధువులు తెలిపారు. ఎదురుగా వస్తున్న బైక్ రాంగ్ రూట్‌లో రావడంతోనే ఆటో అదుపు తప్పి ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజక్షన్ వికటించి మహిళ మృతి

- ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చిన మహిళ
- చిన్నారి జననం
- మృతురాలి బంధువుల ఆందోళన


జన్మించిన చిన్నారి


మృతి చెందిన ఇద్దమ్మ

మాచర్ల: పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో వెల్దుర్తి మండలం వజ్రాలతండాకు చెందిన జె.ఇద్దమ్మ (27) ఐదో కాన్పుకు వచ్చింది. వచ్చిన గంట తరువాత చిన్నారి పాపకు జన్మిచ్చింది. వైద్యులు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఇద్దమ్మ మృతిచెందింది. ఇద్దమ్మ మృతికి వైద్యులు కారణమంటూ మృతురాలి బంధువులు, గ్రామ ప్రజలు ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. వైద్యులు సరైన చికిత్స అందిస్తే మృతిచెందేది కాదంటూ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.చారిలను నిలదీశారు. వైద్య సేవలు వైద్యులు సరిగా అందజేయడం జరిగిందన్నారు. ఇద్దమ్మ రక్తహీనత కారణంగా అనారోగ్యానికి గురై మృతి చెందిందని, వైద్యుల నిర్లక్ష్యం కాదని సూపరింటెండెంట్ చెప్పారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ ప్రభాకరరావు బాధితుల నుంచి వివరాలు సేకరించారు. వైద్యులతో చర్చించి సంఘటన వివరాలు నమోదు చేసుకున్నారు. జన్మించిన చిన్నారి సురక్షితంగా ఉంది. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు పోలీసులు సర్దిచెప్పారు.

కొనసాగుతున్న సాగర్ మేజర్ కాల్వల మరమ్మతులు


కాల్వలో పూడిక తీస్తున్న జేసీబీ

కారెంపూడి: సాగర్ మేజర్ కాల్వల మరమ్మతు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం పెదకొదమగుండ్ల మేజర్ కాల్వ మరమ్మతు పనులు చేపట్టారు. రెండు జేసీబీలతో కాల్వ కట్టలపై ఉన్న కంప చెట్లు తొలగించడంతోపాటు కాల్వలో ఉన్న నాచు జమ్ముతోపాటు మట్టి పూడిక తీసే పనులు చేస్తున్నారు. సాగర్ కుడి కాల్వ ప్రారంభం నుంచి మేజర్ కాల్వను బాగుచేసే పనులు ప్రారంభించారు. సాయంత్రానికి కాల్వ జమ్మి చెట్టు వరకు పనులు జరిగాయి. రేపటికల్లా మరమ్మతు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

ముగిసిన చెస్ టోర్నమెంట్


ఎంపికైన విశ్వవిద్యాలయం టీంలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ క్రీడా విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (కాకినాడ) సెంట్రల్ జోన్ చెస్ (మెన్ అండ్ ఉమెన్) అంతర్ కళాశాలల చెస్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. అనంతరం విశ్వవిద్యాలయం టీమ్‌లను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా క్రీడా విభాగ కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టూ అమర్‌సుదీర్, కోశాధికారి రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, క్రీడా విభాగాధిపతి విక్టర్‌జాన్సన్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మెన్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రథమ స్థానంలోనూ, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ద్వితీయ స్థానంలోనూ, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ తృతీయ స్థానంలో నిలిచాయి. ఉమెన్స్ విభాగంలో ప్రథమ స్థానంలో పీవీపీ సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ద్వితీయ స్థానంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, తృతీయ స్థానంలో పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ గెలుపొందారు.

విశ్వవిద్యాలయం చెస్ టీమ్

జేఎన్‌టీయూ కాకినాడ చెస్ టీమ్ సెలక్షన్స్ జరిగాయి. బాలుర విభాగంలో కె.శశాంక్ (కె.హెచ్.ఐ.టి, చోడవరం), కె.గుణశేఖర్ (పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ విజయవాడ), ఎ.నిఖిల్‌దత్ (జేఎన్టీయూకే, నరసరావుపేట) వై.రమశ్రీకర్ (సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్), కె. గౌతమ్‌ధర్మ (ఎస్ఐఈటి, అమలాపురం) బీజేఎస్‌కే రణధీర్ (ఎస్ఆర్ఐటి, ఆగిరిపల్లి) స్టాండ్‌బైలో కె.త్రిదేవ్‌రెడ్డి (పీఎస్‌సీఎంఆర్), విశ్వనాథ్ (పీఎస్‌సీఎంఆర్) అర్హత సాధించారు. చెస్ ఉమెన్స్ విభాగంలో బి.నిహారిక (పీవీపీఎస్ఐటీ, కానూరు) ఎల్.శ్వేత శ్రీ (పీవీపీఎస్ఐటీ) షేక్ సమీరా (పీఎస్‌సీఎంఆర్) కేఎంఎస్ఎల్ సింధూర (పీవీపీఎస్ఐటీ) జి.హర్షితదేవి (ఎస్ఆర్‌జీఈసీ గుడ్లవల్లేరు), జి.విజయలక్ష్మి (ఎస్ఆర్‌కేఆర్, భీమవరం)లు అర్హత సాధించారు. స్టాండ్‌బైలో ఎ.ఝాన్సీ (ఎస్ఆర్‌కేఆర్ భీమవరం), సీహెచ్ శ్రీకృష్ణకీర్తి (పీఎస్‌సీఎంఆర్)లు ఎంపికయ్యారు. ఎంపికైన బృందాలు డిసెంబర్ నాలుగు నుంచి ఏడు వరకు చెన్నై వెల్‌టెక్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సముద్ర తాబేళ్లను రక్షించాలి


తాబేళ్ల రక్షణకు సంబంధించిన కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న అధికారులు

వేటపాలెం: తాబేళ్ల రక్షణ బాధ్యతను మత్స్యకారులు తీసుకోవాలని ఇండియన్ కోస్ట్‌గార్డు అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ శివబాలన్ పేర్కొన్నారు. మండలంలోని రామాపురం సముద్ర తీరంలోని కోస్ట్ రిసార్ట్‌లో ట్రీ ఫౌండేషన్ అధ్వర్యంలో ఐటీసీ బంగారు భవిష్యత్ సౌజన్యంతో 'మడ అడవుల పెంపకం, సంరక్షణ- సముద్ర తాబేళ్ల రక్షణ' అంశంపై వర్క్‌షాపు గురువారం నిర్వహించారు. ఇందులో శివబాలన్ మాట్లాడుతూ... మత్స్యకారులు సముద్ర తాబేళ్లను సంరక్షించడం వల్ల అవి మత్స్య సంపదకు దోహద పడతాయని తెలిపారు. ఎఫ్‌డీఓ రవీంద్ర మాట్లాడుతూ మడ అడవులు ఉన్న ప్రాంతంలో మత్స్య సంపద పెరుగుతుందని చెప్పారు. అడవులు గ్రామాలకు రక్షణగా ఉంటాయని తెలిపారు. ట్రీ ఫౌండేషన్ చైర్ పర్సన్ సుప్రజ ధరిణి మాట్లాడుతూ 2002లో ట్రీ ఫౌండేషన్ ద్వారా సముద్ర తాబేళ్ల రక్షణకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. టేకు వల వాడకం వలన సముద్ర తాబేళ్లు చనిపోతున్నాయని చెప్పారు. ఐటీసీ సీనియర్ ప్రోగ్రాం అధికారి సాయి గౌతం మాట్లాడుతూ సూర్యలంక, ఏటిమొగ, పొట్టి సుబ్బయ్యపాలెంలో మడ మొక్కల నర్సరీ అటవీ శాఖ సహకారంతో పెంచుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా సమన్వయ కర్త శవనం చంద్రారెడ్డి, అటవీ శాఖ సెక్షన్ అధికారి వెంకటేశ్వర్లు, శిరీష, మునిమ్మ పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చీరాల-వేటపాలెం రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపారు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటాయని, డౌన్‌లైన్‌లో రైలు ఢీకొనడంతో మృతి చెందాడనే సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామని చెప్పారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కాలపరిమితిని తగ్గించాలి

పింఛన్‌దారుల సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.కేశవరెడ్డి


మాట్లాడుతున్న కేశవరెడ్డి

గుంటూరు మెడికల్: విశ్రాంత ఉద్యోగుల కమిషన్ చెల్లింపు కాల పరిధిని 15 సంవత్సరాల నుండి 10 సంవత్సరాలకు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ పింఛన్ దారుల సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.కేశవరెడ్డి అన్నారు. గురువారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగ పెన్షన్ దారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చే కమ్యూటేషన్ కాల పరిమితిని తిరిగి చెల్లించే పరిధిని తగ్గించాలని కోరారు. పంజాబ్ రాష్ట్రంలో 15 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలు, హర్యానాలో 12 సంవత్సరాలు, గుజరాత్ లో 13 సంవత్సరాలకు కాల పరిమితి తగ్గించారన్నారు. అదే తరహాలో ఏపీలో కమ్యూటేషన్ కాల పరిధిని 10 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశ్రాంత ఉద్యోగుల పట్ల తక్షణమే స్పందించి విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన మెడికల్ రియంబర్స్ మెంట్ బిల్లులు, గ్రాట్యుటీ బిల్స్ వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు చెల్లించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మౌలాలి, జిల్లా కోశాధికారి సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసాద్, జోజప్ప పాల్గొన్నారు.

హెచ్చరించినా వినకపోవడంతోనే దేవరాజ్ హత్య

ములుకుదురు హత్య కేసును ఛేదించిన రూరల్ పోలీసులు


మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు

పొన్నూరు: మండలంలోని ములుకుదురు గ్రామంలో ఈ నెల 9వ తేదీన నక్కల దేవరాజ్ హత్యకు మహిళతో సన్నిహిత సంబంధమే కారణమని తెనాలి డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో హత్యకు కారణాలను డీఎస్పీ వెల్లడించారు. గ్రామానికి చెందిన దేవరాజ్ విద్యుత్ శాఖలో మీటర్ రీడింగ్ తీసే పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని మాధవ్, మణికంఠ, గౌతమ్‌ల ఇంటికి వెళ్లినప్పుడు మహిళల పట్ల దేవరాజ్ ప్రవర్తన బాగా లేకపోవడంతో అతనిని పలుసార్లు వారు హెచ్చరించారు. అయినా దేవరాజ్ తన ప్రవర్తన మార్చుకోకుండా మాధవ్ భార్యతో సన్నిహిత సంబంధం పెట్టుకుని చనువుగా వ్యవహరిస్తున్నాడు. దీంతో ఆగ్రహానికి గురైన మాధవ, స్నేహితుడు మణికంఠతో దేవరాజ్‌ను చంపాలని, అందుకు రూ. 2 లక్షలు ఇస్తానని చెప్పాడు. మణికంఠ అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు (జోసఫ్, సాయి, రాజు)లకు డబ్బు ఆశ చూపి దేవరాజ్‌ను తీవ్రంగా కొట్టి కాళ్లు, చేతులు విరిచేలా ఒప్పందం చేసుకున్నారు. పథకం ప్రకారం 9న రాత్రి దేవరాజ్ కళ్లలో కారం కొట్టి పొలాల్లోకి లాక్కెళ్లి తీవ్రంగా కొట్టి హత్య చేశారు. రాత్రి బయటికి వెళ్లిన భర్త ఇంటికి రాకపోవడంతో వెతుకుతున్న దేవరాజ్ భార్యకు పొలాల్లో దేవరాజ్ శవమై కనిపించాడు. ఆమె ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ, హత్య కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ కిరణ్ బాబు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనంపై కేసు నమోదు

తాడికొండ: తుళ్ళూరు మండల పరిధిలోని మందడం, వెంకటపాలెం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్ళూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాల ప్రకారం గత కొంత కాలంగా పంట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకు గురవుతున్న క్రమంలో మందడం వెంకట పాలెం గ్రామానికి చెందిన 3 రైతులకు చెందిన 2.15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు లైన్‌మెన్ టి పగిడి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండలు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.